'పరిపాలనలో కాంగ్రెస్ విఫలం'

గూడూరు, న్యూస్‌టుడే: అత్యధిక మంది కార్యకర్తలతో భాజపా ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీ అవతరించిందని భాజపా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి అన్నారు. గూడూరులో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు గుండబోయిన మల్లేష్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న కాలంలో భాజపా అధికారంలోకి వస్తుందన్నారు. తొమ్మిది నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు పరిపాలన అందించడంలో విఫలమైందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్, చెరుకూరి శ్రీశైలం, శ్రీనివాస్, శ్రీనివాసాచారి, శ్రీను, వెంకన్న, జంపయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే ధ్యేయం

కురవి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రామచంద్రునాయక్ అన్నారు. గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం చేపట్టే వారి సహకారంతో కురవి మండలం నేరడ ఆదర్శ పాఠశాల ఆవరణలో ఉన్న బండలను తొలగించి శుభ్రం చేసిన మైదానాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలంటే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకోవాలన్నారు. అనంతరం బాల్యతండాలో గాయకుడు దేవేందర్ ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు.

మైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామచంద్రునాయక్

కురవి శ్రీవీరభద్రస్వామి ఆలయ ఛైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు వీరభద్రం, నాగన్న, వెంకట్ రెడ్డి, నజీర్, యాకూబ్ ఉన్నారు.

ఈనాడు మహబూబాబాద్

మత్తులో 'ముంచుతా'..

నేను గంజాయిని.. సమాజాన్ని పీడిస్తున్న మహమ్మారిని.. ఒకప్పుడు పెద్ద నగరాల్లో.. పట్టణాల్లో నా ఉనికి ఉండేది.. ఇప్పుడు పల్లెలకూ పాకాను.. పిల్లలు, యువకులే కాదు.. అమ్మాయిలూ నాకు దాసోహం అవుతున్నారు. ఇదే అదనుగా వారిని బానిసలుగా మార్చేస్తున్నాను. నా 'మత్తు'లో ముంచి.. విలువైన జీవితాలను చిత్తు చేస్తున్నాను.. అనారోగ్యం బారినపడి.. జైలుపాలైన వారి సంబంధీకులు నిత్యం క్షోభ అనుభవిస్తున్నారు. ఇంతకూ నాలో ఏం ఉంటుందని అనుకుంటున్నారా..? మత్తును కలిగించే టెట్రా హైడ్రోకన్నాబినాల్ (టీహెచ్‌సీ) అనే రసాయన ప్రభావమే కారణం.. మెకంలో ముంచి.. విచక్షణ కోల్పోయేలా చేస్తాను.

నాకెన్నో రూపాలు : అక్రమార్కులు నన్ను అంగట్లో పెట్టి జేబులు నింపుకొంటున్నారు.. ఎండిన ఆకు రూపంలో విక్రయిస్తే పట్టుబడతామని నాకు యాష్ ఆయిల్, చాక్లెట్ల రూపాన్ని తీసుకొచ్చారు. నాకు భిన్నరూపాలు, మార్గాలు ఉండటంతో పోలీసులూ ఏం చేయలేకపోతున్నారు. ఆంధ్రా- ఒడిశా సరిహద్దు నుంచి భద్రాచలం మీదుగా ఉమ్మడి వరంగల్‌లో ప్రవేశిస్తున్నా.. మరి నన్ను తరిమికొడతారా..? దాసోహం అవుతారా..? అనేది మీ చేతుల్లోనే ఉంది.



జీవితాలు కూల్చుతా!

ఇలాంటి దారుణాలెన్నో..!

ఈనాడు, మహబూబాబాద్ -న్యూస్‌టుడే, వరంగల్ క్రైం, కాటారం (భూపాలపల్లి జిల్లా)

- భూపాలపల్లి జిల్లా మహాముత్తారంలో ఇద్దరు యువకులు గంజాయికి బానిసై నేరాలు చేసేందుకు అలవాటుపడ్డారు. మత్తులో పలువురిపై దాడి చేయడంతో జైలు పాలయ్యారు. కుటుంబ సభ్యులు కోర్టుల చుట్టూ తిరిగి ఆర్థికంగా నష్టపోయారు.
- ఇదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు గంజాయికి బానిసై మానసిక పరిస్థితి బాగోలేక పిచ్చిగా ప్రవర్తించేవాడు. కుటుంబ సభ్యులు మానసిక వైద్య నిపుణుడి వద్ద చికిత్స అందించారు. రూ.వేలల్లో ఖర్చయింది.
- భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని పేద కుటుంబానికి చెందిన కుమారుడు ఎదిగి ఆసరాగా ఉంటాడనుకుంటే గంజాయికి బానిసై.. రవాణా చేస్తుండగా.. ఇటీవల పోలీసులకు చిక్కి జైలుపాలయ్యాడు. కుటుంబం మానసిక క్షోభ అనుభవిస్తోంది.

గంజాయి మానవ శరీరంలోని వివిధ అవయవాలపై ప్రభావం చూపుతుందని భూపాలపల్లి వైద్య కళాశాల సూపరింటెండెంట్, ప్రొఫెసర్ డాక్టర్ కోడూరు నవీన్‌కుమార్ వివరించారు..

ప్రభావం ఇలా..



- **మెదడు :** తరచూ ఎక్కువ మోతాడులో తీసుకుంటే నాడీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది. పిచ్చిపిచ్చిగా ప్రవరిస్తుంటారు. తెలియని ఆతృత, భయం కలిగి ఉంటారు. ఇంద్రియాలు అధీనంలో ఉండవు.
- **దృష్టిలోపం :** అతిగా తీసుకోవడంతో కళ్ల ఎర్రగా కనిపిస్తాయి. దృష్టి లోపానికి గురయ్యే ప్రమాదం ఉంది.
- **గుండె :** హృదయ స్పందన రేటు, రక్త పోటు పెరుగుతుంది. గుండెపోటు వచ్చే ప్రమాదం ఎక్కువ.
- **ఊపిరితిత్తులు :** ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. శ్వాసకోశ సమస్యలు ఎదురవుతాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంటుంది.

2024(ఇప్పటివరకు)లో పట్టుకున్న గంజాయి వివరాలు

వరంగల్ కమిషనరేట్	850.000	2,75,00,000	101
మహబూబాబాద్	485.198	1,21,43,325	20
భూపాలపల్లి	25.000	6,25,000	25
ములుగు	38.473	9,58,317	11

● పోలీస్ విభాగం ● పట్టుకున్న గంజాయి(కిలోల్లో)
● విలువ(రూ.లక్షల్లో) ● నమోదుచేసిన కేసులు

క్వింటాళ్లలో రాక..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు 2023లో రూ.4.14 కోట్ల విలువచేసే 20 క్వింటాళ్ల గంజాయి పట్టుకొని 103 కేసులు నమోదు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి రూ.4.12 కోట్ల విలువైన 13 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం చేసుకొని 157 కేసులు నమోదు చేశారు. అత్యధికంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్, మహబూబాబాద్ జిల్లాలోనే పట్టుబడింది.

నిరంతరం నిఘా..

- అంబర్ కిశోర్ ఝా, సీపీ, వరంగల్

గంజాయి రవాణా, సేవించడంపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంది. టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులతో ప్రత్యేక టీం ఏర్పాటు చేశాం. నిందితులకు శిక్షలు పడేలా సాక్ష్యాలను సేకరిస్తున్నాం. పదేపదే గంజాయి రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్టులను నమోదు చేస్తున్నాం.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు తథ్యం

ముల్కలపల్లిలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

డోర్నకల్, న్యూస్‌టుడే: రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిలబడే అభ్యర్థి ఎవరైనా తమ గెలుపు తథ్యమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. ముల్కలపల్లిలో ఆదివారం జరిగిన సంఘం 11వ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రధానోపన్యాసం చేస్తూ ప్రకటన వెలువడక పోయినా ఇప్పటి నుంచే ఎన్నికలకు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమాలు, పోరాటాలకు టీఎస్‌యూటీఎఫ్ పెట్టింది పేరని పేర్కొన్నారు. నర్సిరెడ్డి ఎమ్మెల్సీ అయ్యాక సాధించిన విజయాలను వివరించారు. మహాసభలో రాష్ట్ర పూర్వ కార్యదర్శి బండి నర్సింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యాకుబ్, మండలాధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ వివేక్, జిల్లా కార్యదర్శి నామ వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి శివ ప్రసాద్, నాయకులు శ్రీనివాస్, సాహెబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలకు 'పాట' ఊడిగం చేయొద్దు

నెల్రాఖాసెంటర్, న్యూస్‌టుడే: ప్రభుత్వాలకు 'పాట' ఊడిగం చేసే లా ఉండకూడదని ప్రజల కోసం నిలివాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వేణు అన్నారు. ఆదివారం మానుకోటలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాకారులు ప్రజా కళలు, ప్రజాసంస్కృతి పరిరక్షణకు ఉద్యమించాలన్నారు. ప్రజా కళాకారులపై ప్రభుత్వ అక్రమ కేసులు ఎత్తివేయాలన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా లూనావత్ తారాచంద్, కార్యదర్శిగా హరీష్, నాగరాజు, నాగేశ్వర్‌రావు, రాకేష్, కృష్ణ, మహేష్‌లను సభ్యులుగా ఎన్నుకున్నారు.

విద్యుత్తు కనెక్షన్ల పేరిట దళారుల దందా..!

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని దశాబ్ద కాలంగా నివసిస్తున్న పేదలకు కొత్త విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే కొందరు దళారులు కాసులు వసూళ్లకు శ్రీకారం చుట్టారు. మహబూబాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో దళారులు కాలనీలవారీగా ఇంటింటికీ వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇంటి నెంబరు లేనివారు ఆధార్ కార్డు కలిగిన యజమాని కేవలం విద్యుత్తు దీపాల కోసమే మీటర్ ఇవ్వాలని అఫిడవిట్‌తో పాటు సెల్ఫ్ డిక్లరేషన్ పత్రం సమర్పించాలి. విద్యుత్ మీటర్ కోసం రూ. 938 చెల్లించి సోమవారం వరకు దరఖాస్తు చేసుకోవలసి ఉంది. ఈ అవకాశాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్న ఆయా ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు రూ. 3 నుంచి 4 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఆదాయం పెంపుకోసం..

ఉన్న ప్రభుత్వ స్థలాల్లో వేలాది మంది నిరుపేదలు గుడిసెలు వేసుకొన్నారు. వాటికి విద్యుత్తు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. మరికొందరు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరఫరా తీసుకుని ఒకటి, రెండు విద్యుత్తు దీపాలతో సర్దుకుపోతున్నారు. ఇళ్లు అక్రమ నిర్మాణమని రెవెన్యూ, పురపాలక శాఖాధికారుల సూచనల మేరకు వాటికి ఇంటి నెంబర్లు లేవంటూ విద్యుత్తు శాఖాధికారులు కనెక్షన్లు ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో జీవో 48, 59 ద్వారా స్థలాలను క్రమబద్ధీకరించి కొందరికి ఇంటి నెంబర్లు కేటాయించగా వారికి మీటర్లు ఇచ్చారు. మీటర్లు రానివారు పట్టణంలో సుమారు మూడు నుంచి నాలుగు వేల ఇళ్లు ఉండొచ్చని అధికారులు ఒక అంచనాకు వచ్చారు. మీటర్లు ఇస్తే విద్యుత్తు శాఖకు ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగించుకున్నవారికి రాయితీ ఇస్తుండడంతో కొత్త మీటరు ఇస్తే రాయితీ వస్తుందంటూ గుడిసె వాసుల ఇబ్బందులను గుర్తించిన స్థానిక ప్రజాప్రతినిధులు టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులతో మాట్లాడారు. ఇదే అదనుగా భావించి కొందరు కాలనీల పెద్దలు, నాయకులు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల ఓ పార్టీ నాయకుడి ఇంటివద్ద విద్యుత్తు అధికారి కూర్చొని జాబితా రూపొందిస్తుండగా అదే ప్రాంతానికి కొందరు అభ్యంతరం తెలపడం వివాదాస్పదంగా మారింది. నాలుగైదు కాలనీలకు చెందిన కొందరు ప్రతినిధులు గుడిసెవాసులకు విద్యుత్తు మీటర్లు ఇప్పిస్తామంటూ మా ద్వారానే దరఖాస్తులు చేసుకోవాలని హుకుం జారీ చేసి డబ్బులు వసూలు చేసినట్లు ఆ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

ఈ విషయమై టీఎస్ఎన్‌పీడీసీఎల్ డీఈ విజయ్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో అధికంగా డబ్బులు వసూలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఒక్కో విద్యుత్ మీటర్ కనెక్షన్‌కు రూ. 938 రూపాయలు మాత్రమే చెల్లించాలని సూచించినట్లు తెలిపారు.

కమనీయం.. జైనుల శోభాయాత్ర

దస్ లక్షణ్ పర్వ్ అనంతరం గార్లలోని జైన్ మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గార్లలో జైనులు శోభాయాత్రను నిర్వహించారు. మహావీర్‌జైన్ విగ్రహంతో పాటలు, నృత్యాలతో ప్రదర్శన చేశారు. అహింసో పరమ్‌ధర్మ్, పశు బచావో, రాష్ట్రకో బచావో, సుఖీ జీవన్ బీచావో అంటూ నినాదాలు చేశారు. ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థనలు చేశారు. జైన్ పరివార్ రాష్ట్ర అధ్యక్షుడు వినోద్‌కుమార్‌జైన్ సహా మహారాష్ట్ర, డోర్నకల్, ఖమ్మం జైనులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, గార్ల (మహబూబాబాద్)

భాజపా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

మరిపెడ, న్యూస్‌టుడే: భాజపా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని భాజపా క్రమశిక్షణా సంఘం ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు అన్నారు. ఆదివారం మరిపెడలో భాజపా సంస్థాగత సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. రాష్ట్రంలో 50 లక్షల ఇళ్లకు సభ్యత్వం చేరడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గడువులోగా సభ్యత్వ నమోదు లక్ష్యం చేరుకోవాలన్నారు. నాయకులు రాంబాబు, మండల నాయకులున్నారు.

మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి పరామర్శ

కేవ్లానాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భారాస నాయకులు

రాయపర్తి, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తండ్రి కేవ్లానాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మండలంలోని బాలాజీనగర్(టీ) తండాలో ఆదివారం ఆయన దశదినకర్మ వేడుకలు నిర్వహించారు. మాజీ మంత్రి దయాకర్‌రావు, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డిలు కేవ్లానాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. భారాస నాయకులు సుధీర్‌రెడ్డి, అనిమిరెడ్డి, మధు తదితరులున్నారు.

క్రీడా ప్రాంగణంలోనే ఇసుక నిల్వలు!

గ్రామీణ ప్రాంత యువత, బాలల కోసం ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అవి ఆటలకు బదులుగా ఇసుక అక్రమ నిల్వలకు అడ్డాలుగా మారుతున్నాయి. దళారులు ట్రాక్టర్లతో ఇసుక తరలించి కుప్పలుగా పోస్తున్నారు. మండలంలోని కౌసల్యాదేవిపల్లి గ్రామ శివారు ఆకేరు వాగు నుంచి గ్రామంలోని ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణంలో నిల్వ చేసి తరలిస్తున్నారు. తహసీల్దార్ చప్పిడి నాగరాజు రెవెన్యూ సిబ్బందిని పంపి క్రీడా ప్రాంగణంలోని ఇసుక నిల్వలను సీజ్ చేయించారు. క్రీడా ప్రాంగణంలో సుమారు 5ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక ఉంటుందని రెవెన్యూ సిబ్బంది పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, నర్సింహులపేట (మహబూబాబాద్)

(c) eenadu

నల్ల సూరీలు.. కండల వీరులు!

ఓ వైపు దేశానికి వెలుగు అందించేందుకు రక్తాన్ని చెమటగా మార్చి.. బొగ్గు గనుల్లో పని చేస్తూనే.. మరోవైపు క్రీడలపై ఆసక్తితో జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు ఈ నల్ల సూరీలు.. రాష్ట్ర స్థాయిలో ఇటీవల కొత్తగూడెంలో నిర్వహించిన పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారు. జాతీయ స్థాయిలో కోల్ ఇండియా పోటీలకు భూపాలపల్లి సింగరేణి డివిజన్ నుంచి ఎనిమిది మంది ఎంపిక వడం విశేషం.. ఒడిశాలోని ఎంసీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు పోటీలు నిర్వహించారు. ఇందులో రెండు బంగారు, మూడు రజత, ఒక కాంస్య పతకం సాధించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు, సింగరేణి క్రీడల సూపర్‌వైజర్ పర్శ శ్రీనివాస్‌ను భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్, అధికార ప్రతినిధి కె.మారుతి అభినందించారు.

–న్యూస్‌టుడే, భూపాలపల్లి

కోల్ ఇండియా పోటీల్లో పాల్గొన్న వివిధ రాష్ట్రాల క్రీడాకారులు

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆరు పతకాలు

బంగారు పతకం సాధించా..

- సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, కేటీకే 6వ గని కోల్ కట్టర్

సింగరేణి సంస్థలో 2015లో ఉద్యోగంలో చేరాను.. ప్రస్తుతం భూపాలపల్లి డివిజన్‌లోని కేటీకే 6వ గనిలో కోల్‌కట్టర్‌గా విధులు నిర్వహిస్తున్నా.. నిత్యం క్రికెట్ ఆడటం, వాకింగ్ చేయడం అలవాటు. ఈ క్రమంలోనే సింగరేణి జిమ్ కోచ్ సమ్మయ్య, క్రీడల సూపర్‌వైజర్ శ్రీనివాస్ సలహాలతో బాడీ బిల్డింగ్ క్రీడ ఎంచుకుని నిత్యం సాధన చేశాను. 2017లో మొదటిసారి కోల్ ఇండియా పోటీల్లో పాల్గొని బంగారు, రజత పతకాలు సాధించాను. 2019లో మిస్టర్ సింగరేణి, 2022లో మిస్టర్ తెలంగాణ ప్రత్యేక అవార్డులు పొందాను. ఇటీవల ఒడిశాలో జరిగిన కోల్ ఇండియా పోటీల్లో బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు సాధించాను..

కంపెనీ స్థాయిలో ప్రథమం..

- శ్రీలేఖ్య, కేటీకే 5వ గని బదిలీ వర్కర్

కేటీకే 5వ గనిలో బదిలీ వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను.. ఈ ఏడాదిలోనే వారసత్వ ఉద్యోగంలో చేరాను. చిన్నవయసు నుంచే ఆటలంటే ఎంతో ఇష్టం. ఇంటర్, డిగ్రీ చదువుతున్న సమయంలో సింగరేణి ఆధ్వర్యంలో పోలీసు కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల కోసం నిర్వహించిన ఉచిత శిక్షణకు హాజరయ్యాను. పరుగు పందెం పోటీల్లో పట్టు సాధించడమే కాకుండా పవర్ లిఫ్టింగ్ క్రీడపై ఆసక్తి పెంచుకున్నా.. ఇటీవల కొత్తగూడెంలో జరిగిన కంపెనీ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాను. జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 52 కిలోల విభాగంలో రజత పతకం సాధించాను..

సింగరేణి 'స్ట్రాంగ్ ఉమెన్'

- పి.శ్వేత, స్టాఫ్ నర్సు, భూపాలపల్లి ఏరియా ఆసుపత్రి

2022లో భూపాలపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సుగా చేరాను. మహిళా విభాగంలో సింగరేణిలో మొదటిసారి పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తుండటంతో సాధన మొదలుపెట్టాను. 2022లో శ్రీరాంపూర్ ఏరియాలో నిర్వహించిన పోటీల్లో 73 కిలోల విభాగంలో మొదటి స్థానంలో నిలిచాను. సింగరేణిలో 'స్ట్రాంగ్ ఉమెన్' టైటిల్ సాధించాను.. కోల్ ఇండియా జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో 69 కిలోల విభాగంలో రజత పతకం సాధించాను.

కోచ్‌గా క్రీడాకారులను తయారుచేస్తా..

- పుట్ట ప్రకాష్, రెస్క్యూ బ్రిగేడియర్, ఈపీ ఆపరేటర్

2016లో సింగరేణిలో ఉద్యోగంలో చేరాను.. ప్రస్తుతం రెస్క్యూ బ్రిగేడియర్, ఈపీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నా.. 2017లో నిర్వహించిన కోల్ ఇండియా పోటీల్లో బాడీ బిల్డింగ్‌లో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నా.. వరసగా 2019 నుంచి 2023 వరకు కోల్ ఇండియా పోటీల్లో పాల్గొంటూ రజత పతకాలు సాధించాను. ఈ సారి పోటీల్లో పతకం చేజారింది.. భవిష్యత్తులో అధికారులు సహకరిస్తే కోచ్‌గా విధులు నిర్వహిస్తా

పట్టుదలతో రజత పతకం...

- మీర్జా యాసిన్ బేగ్, కేటీకే 1వ గని అండర్ మేనేజర్

2016లో సింగరేణిలో ఉద్యోగంలో చేరాను. కేటీకే 1వ గనిలో సీనియర్ అండర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. మొదటి నుంచి క్రీడలంటే ఇష్టం. పవర్ లిఫ్టింగ్ ఎంచుకుని నిత్యం జిమ్‌కు వెళ్లి సాధన చేస్తున్నాను. రెండేళ్లుగా కంపెనీ స్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుతున్నా.. 2023లో ఇదే పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచాను. మరింత పట్టుదలతో సాధన చేస్తూ, 120 క్లేస్ కేటగిరీలో పాల్గొని కోల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యాను. రజత పతకం సాధించాను.

13 ఏళ్లుగా రాణిస్తూ..

- బానోతు రమేష్, కేటీకే 6వ గని ట్రామర్

బెల్లంపల్లి డివిజన్‌లో 2006లో సింగరేణిలో ఉద్యోగంలో చేరాను. 2008లో భూపాలపల్లి డివిజన్‌కు బదిలీపై వచ్చాను. ప్రస్తుతం కేటీకే 6వ గనిలో ట్రామర్‌గా విధులు నిర్వహిస్తున్నా.. 2011 నుంచి 2016 వరకు నిర్వహించిన కోల్ ఇండియా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నా.. ఈ క్రమంలోనే 2016లో 800 మీటర్ల పరుగు పందెం పోటీల్లో రజత పతకం సాధించా.. 2019లోనూ వెయిట్ లిఫ్టింగ్‌లో పాల్గొని మరోసారి రజత పతకం కైవసం చేసుకున్నా.. ఈ సారి కోల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యాను.

పారాహుషార్!

న్యూస్‌టుడే, వరంగల్‌క్రైం(వర్ధన్నపేట)

బతుకమ్మ, దసరా పండగల వేళ సైబర్ నేరగాళ్లు ఆఫర్ల ఎర వేసే ప్రమాదం ఉంది. సామాజిక మాధ్యమాల్లో తక్కువ ధరకే చరవాణులు, దుస్తులు, చేతి గడియారాలు అంటూ ఆకట్టుకునేలా ప్రకటనలు ఇస్తారు. ఆశపడి.. లింక్ క్లిక్ చేస్తే అంతే సంగతులు. ఇదంతా మోసం అని తెలునుకునే లోపు ఖాతాలోని నగదు మాయమవుతుంది.

అత్యాశకు పోతే అంతే సంగతులు..

ప్రముఖ కంపెనీలకు చెందిన లోగోలను అచ్చం వాటి మాదిరిగానే తయారు చేసి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ లాంటి సామాజిక మాధ్యమాల్లో లింక్‌లు పంపిస్తున్నారు. వాటి గురించి తెలియకుండానే అనేక మంది వాటిని ఇతరులకు పంపిస్తుంటారు. మార్కెట్ ధర కంటే 50శాతం నుంచి 75శాతం వరకు తగ్గింపు ధరలకు ఇస్తామంటూ.. వల వేస్తారు.

● ఉదాహరణకు ఇన్‌స్టాగ్రామ్ చూస్తుండగా.. అకస్మాత్తుగా ఒక ప్రకటన కనిపిస్తుంది. అందులో రూ.1500కే ఐఫోన్ అంటూ.. కింద టైం నడుస్తూ ఉంటోంది. మరికొద్ది సేపట్లో ఈ ఆఫర్ ముగుస్తుందని రాసి ఉండటంతో.. మనం ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వరు. ఇంతలో లింకు తెరిచి.. యూపీఐ లేదా బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేస్తే. . అంతే సంగతులు. మనం తేరుకునేలోపే ఖాతా ఖాళీ అవుతుంది.

● గతేడాది వరంగల్‌కు చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు వాట్సప్ ద్వారా వచ్చిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. తెరిచి చూడగా తక్కువ ధరకు ద్విచక్ర వాహనం విక్రయిస్తామని చెప్పి వాహన చిత్రాన్ని పెట్టాడు. మార్కెట్ దీని ధర రూ.75 వేలు ఉంటుంది. డబ్బులు అవసరం ఉందని కేవలం రూ.25 వేలకు ఇస్తానని చెప్పాడు. దీంతో ఉద్యోగి ఆన్‌లైన్ ద్వారా రూ.25 వేలు పంపించాడు. రెండురోజుల తర్వాత అడిగితే మరో రూ.10 వేలు పంపించాలని కోరాడు. అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తర్వాత చరవాణి స్విచ్ ఆఫ్ చేశాడు.

● హనుమకొండ జిల్లాకు చెందిన ప్రైవేటు ఉద్యోగినికి అలంకరణ వస్తువులు తక్కువ ధరకు ఇస్తామని చెప్పి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సందేశం పంపించారు. తక్కువ ధరకు వస్తున్నాయని రూ.10 వేల విలువైనవి ఆర్డర్ చేశారు. తర్వాత చరవాణికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. కొద్దిరోజుల తర్వాత పార్సిల్ వచ్చింది. తెరిచి చూడగా నాసిరకమైన వస్తువులు ఉన్నాయి.

పండగ వేళ

● ఆఫర్ల విషయంలో అప్రమత్తత అవసరం

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి

ధర తక్కువంటే ఆలోచించాల్సిందే..

సైబర్ మోసగాళ్లు భారీ డిస్కౌంట్స్ ఇస్తామని చెప్పి యాప్‌ల ద్వారా ప్రచారం చేస్తారు. మార్కెట్‌లో ఐఫోన్- 16 ధర రూ.1 లక్షకు పైగా ఉంటే దానిపై 75శాతం వరకు డిస్కౌంట్ ఇస్తామని ప్రకటనలు ఇస్తారు. ఓ యాప్‌తో పాటు ఫోన్ చిత్రాన్ని అందుబాటులో ఉంచి డబ్బులు పంపించాలని సూచిస్తారు. తక్కువ ధరకు వస్తుందని యాప్ తెరిచి కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తే మోసపోవడం ఖాయం.

ఇలా చేస్తే సురక్షితం..

ఆన్‌లైన్‌లో వివిధ కంపెనీలకు చెందిన వస్తువులను కొనుగోలు చేయాలనుకుంటే గూగుల్ ప్లేస్టోర్, ఆపిల్ ఆఫ్ స్టోర్స్ నుంచి యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో కంపెనీలకు చెందిన అసలైన యాప్‌లు ఉంటాయి.

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో సైబర్ మోసాల వివరాలు (జనవరి 1 నుంచి సెప్టెంబరు 15 వరకు)

నమోదైన కేసులు	134
పోయిన డబ్బులు	7.85 కోట్లు
రికవరీ చేసిన నగదు	రూ. 95.25 లక్షలు

1930కి ఫిర్యాదు చేయాలి..

- సైబర్ విభాగం ఏసీపీ కె.విజయ్‌కుమార్

మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ధరకు ఆన్‌లైన్‌లో వస్తువులు ఇస్తామంటే వాటిని ప్రజలు నమ్మొద్దు. సామాజిక మాధ్యమాల్లో లింక్‌ల ద్వారా వచ్చే యాప్‌లను ఎట్టి పరిస్థితుల్లో డౌన్‌లోడ్ చేసుకోవద్దు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలి.

'ఎమ్మెల్యే మాటలు వక్రీకరించడం సరికాదు'

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎమ్మార్పీఎస్, ఏ, బీ, సీ, డీ వర్గీకరణ విషయంలో మాట్లాడిన మాటలను వక్రీకరించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

రుణయాప్‌ల వేధింపులతో యువకుడి ఆత్మహత్య

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: రుణం చెల్లించాలంటూ యాప్‌ల నిర్వాహకుల వేధింపులతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హనుమకొండ జిల్లాలో చోటుచేసుకొంది. ఎస్ఐ సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. భీమదేవరపల్లి మండలం ములుకనూర్ గ్రామానికి చెందిన మాడుగుల అనిల్(29) డిగ్రీ వరకు చదువుకున్నారు. వివిధ యాప్‌లు, బ్యాంకుల ద్వారా సుమారు రూ.9 లక్షల వరకు అప్పులు చేసి, ఏడాది కిందట హనుమకొండలో మొబైల్ టిఫిన్ సెంటర్ ప్రారంభించారు. మొదట్లో వ్యాపారం బాగానే సాగినా తరవాత నష్టాలు రావడంతో

అనిల్ (పాత చిత్రం)

మానేశాడు. రెండు నెలల కిందట స్వగ్రామంలోనే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ప్రారంభించారు. వ్యాపారం అంతంత మాత్రంగా ఉండటం, అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఇటీవల యాప్ నిర్వాహకులు అప్పు చెల్లించాలని వేధిస్తుండటంతో ఈ నెల 28న రాత్రి ములుకనూర్ రైతు వేదిక వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. యువకుడి తల్లి వినోద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

లింగాలఘనపురం, న్యూస్‌టుడే : 'బలహీన వర్గాల రిజర్వేషన్లపై కోర్టు తీర్పు ఉంది.. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ప్రభుత్వం తప్పకుండా కులగణన చేపడుతుంది.. ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని' రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. లింగాలఘనపురంలో కేజీకేఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, జిల్లా పాల నాధికారి రిజ్వాన్‌బాషా షేక్‌తో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ కులగణనపై నిన్నమొన్న కూడా చర్చలు జరిగాయన్నారు. గతంలో మాదిరి బలహీన వర్గాలకు అన్యాయం చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని చెప్పారు. జనగామ జిల్లాకు పేరు మార్పు నిర్ణయం ముఖ్యమంత్రి ఇప్పటికే చేశారన్నారు. శాసనసభ్యులం ముఖ్యమంత్రిని కలిసి జీవో వచ్చేలా చూస్తామన్నారు. దసరా

జనగామ జిల్లా లింగాలఘనపురంలో సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్

పండగ లోపు గీత కార్మికుల బీమా బకాయిలు చెల్లించే బాధ్యత తీసుకుంటున్నానని చెప్పారు. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనకు కట్టుబడి ఉందన్నారు.

చెక్‌డ్యామ్‌కు కోత.. మరమ్మతులు సాగదీత!

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: వర్ధన్నపేట, ఇల్లంద గ్రామాల మధ్య ఆకేరు వాగుపై ఉన్న చెక్‌డ్యామ్ గతేడాది వచ్చిన వరదలకు కోతకు గురైంది. అప్పటి నుంచి మరమ్మతులు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పైనుంచి వచ్చిన వరద వల్ల కోతకు గురైన ప్రాంతం మరింత పెరిగింది. దీంతో చెక్‌డ్యామ్‌లో చుక్కనీరు నిల్వ ఉండటం లేదు. కొన్నినెలల క్రితం చెక్‌డ్యామ్ మరమ్మతులు చేయడానికి రూ.30 లక్షల నిధుల కోసం నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. ఇటీవల రాష్ట్రస్థాయి అధికారులు చెక్‌డ్యామ్‌ను పరిశీలించి ప్రతిపాదనల్లో పనులకు సవరణలు సూచించారు. తాగునీటితో పాటు సాగుకు ఉపయోగపడే నీరు వృథా పోతుండటంతో రైతులు, పట్టణ

కోతకు గురైన ప్రాంతం నుంచి దిగువకు వృథాగా పోతున్న నీరు

ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానికుల డిమాండ్ మేరకు జడ్పీటీసీ మాజీ సభ్యుడు సారంగపాణి తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు ముందుకువచ్చారు. ఈ పనులను ఇటీవల ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరిశీలించారు. కానీ పనులు నెమ్మదిగా జరుగుతుండటంతో నీటి వృథా కొనసాగుతోంది.

చికెన్ ధరలు

(కేజీలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
స్కిన్:	115
రిటైల్:	137
డ్రెస్డ్:	199
స్కిన్‌లెస్:	226

ఈ మార్గం.. దుర్గంధభరితం

పున్నేలు, పంథిని శివారులో వరంగల్- ఖమ్మం ప్రధాన జాతీయ రహదారి పక్కన ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలను వదిలివెళ్తున్నారు. కొందరు హోటళ్ల నిర్వాహకులు, తోపుడు బండ్లపై టిఫిన్ అమ్ముతున్న చిరు వ్యాపారులు మిగిలిన ఆహార పదార్థాలను, మాంసం వ్యాపారులు వ్యర్థాలను ఇక్కడే పారబోస్తున్నారు. వాటి నుంచి దుర్గంధం వస్తుండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– న్యూస్‌టుడే, ఐనవోలు (హనుమకొండ)

నాలుగో లైను.. పనులు పరుగులు

ఒకప్పుడు రైలు పట్టాలు వేయాలంటే కార్మికులు నెలల తరపడి శ్రమించేవారు. ఇప్పుడు ఆధునిక యంత్రాలు రావడంతో పనులు పరుగులు పెడుతున్నాయి. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి రోడ్డు నుంచి కాజీపేట ఎఫ్ క్యాబిన్ వరకు వేస్తున్న నాలుగో లైన్ పనులు చకచకా సాగుతున్నాయి. స్లీపర్లపై ముందుగానే పట్టాలు బిగించి, అత్యాధునిక క్రెయిన్-228ల సాయంతో తీసుకొచ్చి నిర్దేశిత స్థలంలో అమర్చుతున్నారు. ఎఫ్ క్యాబిన్ వద్ద ఆదివారం తీసిన చిత్రమిది.

– న్యూస్‌టుడే, కాజీపేట

దేవీ పూజకు వేళాయె..

వినాయక నవరాత్రి ఉత్సవాల సందడి ముగిసి, దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలకు రంగం సిద్ధమవుతోంది. దుర్గా అమ్మవారి విగ్రహాలు పూజకు సిద్ధమయ్యాయి. జనగామలో విగ్రహ తయారీదారులు ఆ ప్రతిమలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. జనగామ పట్టణం, పరిసర గ్రామాల నుంచి 30 విగ్రహాలకు ఆర్డర్ లభించిందని, విగ్రహం ధర రూ.25వేల వరకు ఉంటుందని తయారీదారులు చెబుతున్నారు.

– జనగామ, న్యూస్‌టుడే

పచ్చదనం విరిసింది.. ప్రకృతి మురిసింది

కనుచూపు మేర వరి పైరు. గుట్టకు పచ్చని రంగేసినట్లు చెట్లు. నేల నుంచి నింగి వరకు పచ్చదనం. ఆ ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. చూసేవారికి కనువిందు చేస్తోంది. ధర్మసాగర్, వేలేరు, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల పరిధిలో విస్తరించిన ఇనుప రాతి గుట్టల ప్రకృతి రమణీయత ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తోంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో తీసిన సుందర చిత్రమిది.

– ఈనాడు, హనుమకొండ

EENADU eClassifieds

BIRTHDAY GREETINGS

BUSINESS SERVICES

BUSINESS OFFER

నాటుకోళ్ల పెంపకంలో మంచి అనుభవముండి శాస్త్రీయ పద్ధతిలో పెంచుతున్న నాటుకోళ్ల వ్యాపారం పట్ల ఆసక్తి కలవారు సంప్ర॥ ✆ 7993945852.

SAREES

మావద్ద కంచి, ఆరణి, ధర్మవరం, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి, నారాయణపేట, అన్ని రకముల పట్టు చీరలు & మెనారస్, కలకత్తా, సూరత్ ఫ్యాన్సీ చీరలు హోలొసేల్‌గా లభించును. Hyd, మియాపూర్ ఆల్విన్ కాలనీ. ✆ 7396099834.

BEAUTY & PERSONAL CARE

BEAUTY PARLOUR

Maa mirrors salon Basic Beauty course only- 5000 Certification available. Address: Subedari, HNK. ✆ 9154400576, 6309415548.

WANTED

పార్లర్‌లో పనిచేయుటకు బ్యూటిషన్స్ కావలెను. & బోటిక్ నందు పనిచేయుటకు కటింగ్ మాస్టర్ కావలెను. సంప్రదించుట 9182900152, 9963886324.

EDUCATION

Software ట్రైనింగ్- కెరీర్ గైడ్స్+ లైవ్ ప్రాక్టిక్+ Internship ఈ నాలుగు ఫిపి ఆఫర్ చేస్తుంది, మన Lifeboat Technologies. Python, ఆండ్రాయిడ్, iOS, వెబ్ బలా ఫీల్డ్‌ని మన Hanamkonda లో. Call +91 9182259795.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

శ్రీ వెంకట్ సారక్క జ్యోతిష్యాలయం గురూజీ సంజీవరాజు. భార్యాభర్తల సమస్య, ప్రేమ, పెళ్లి, ఉద్యోగం, వ్యాపారం, రియల్‌ఎస్టేట్, విదేశీయానం. కొత్త బస్టాండ్ హన్మకొండ. Ph: 9640454540

REAL ESTATE

PLOT FOR SALE

భీమారం to చింతగట్టు Main Road Facing 333 గజాల ప్లాట్ అమ్మబడును. వివరాలకు సంప్రదించండి: సెల్: 9700721870.

JOBS

వరంగల్, ఆదోనగర్ అమరాన్ బ్యాటరీస్/ స్పేర్స్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మేనేజర్ కావలెను. సంప్రదిం 9393442215, 26

ఆత్మకూర్ మండలం గుడెపాడు సర్వశ్రీ ప్రభున GK Mess (మన ఫుడ్ వంటలు)లో పనిచేయుటకు అనుభవం గల వంట మనుషులు (భార్యభర్తలకు ప్రాముఖ్యత) వెంటనే కావలెను. (అన్ని రకాల వంటలు టిపిహో). cell: 9989149799.

ప్రముఖ ఆడిట్ కంపెనీలో పనిచేయుటకు లేడీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ & ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన వేతనం ఇవ్వబడును. ✆ 8790207439.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధుల/ పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 18k. ✆ 91609 00024, 96404 00073.

ట్రాన్స్‌జెన్డర్స్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీతం 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. 9182260297.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తలు బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

గుండెపోటుతో యువకుడి మృతి

పాడుగు ప్రేమ్‌సాగర్ (పాతచిత్రం)

కొత్తగూడ, న్యూస్‌టుడే: ప్రపంచ హృదయ దినోత్సవం రోజున.. ఇరవై ఏళ్లు కూడా నిండని యువకుడు.. అప్పటి వరకు స్నేహితులతో కబుర్లు చెబుతూ.. ఒక్కసారిగా గుండెపోటుకు గురై మృతి చెందారు. ఈ విషాద సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కార్లాయిలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పొడుగు నర్సయ్య, మల్లికాంబ దంపతుల చిన్న కుమారుడు పొడుగు ప్రేమ్‌సాగర్(20) ఇంటర్మీడియట్ మధ్యలోనే ఆపేసి ఇంటి వద్దనే ఉంటున్నారు. ఆదివారం స్నేహితులందరు కలిసి గ్రామంలోని ఓ కిరాణ దుకాణం వద్ద శీతలపానీయం తాగుతున్నారు. అనంతరం ఒక్కసారిగా ఛాతినొప్పి వస్తుందంటూ ప్రేమ్‌సాగర్ కుప్పకూలినట్లు పేర్కొన్నారు. స్నేహితులందరు కలిసి ద్విచక్రవాహనంపై కొత్తగూడకు తీసుకొచ్చారు. వైద్యుల సూచన మేరకు నర్సంపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. ఇంతా చిన్న వయసులో యువకుడు గుండెపోటుకు గురవ్వడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. యువకుడి మృతి వార్త తెలియడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

అసంపూర్తి పనులు.. తప్పని కష్టాలు!

పాగుళ్లపల్లి సమీపంలో అసంపూర్తిగా వంతెన నిర్మాణం

కొత్తగూడ, న్యూస్‌టుడే: కొత్తగూడ మండలం పాగుళ్లపల్లి సమీపంలో నిర్మిస్తున్న అసంపూర్తి వంతెన నిర్మాణంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రూ.90 లక్షల నిధులతో పాగుళ్లపల్లి సమీపంలో వంతెనను పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఈ నిధులు కేవలం వంతెన పిల్లర్ల వరకే కేటాయించారు. మిగతా పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాల్సి ఉంది. వంతెన పిల్లర్ల పనులను దక్కించుకున్న గుత్తేదారు వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేశారు. స్లాబు కోసం ప్రత్యేకంగా తిరిగి నిధులు కేటాయించాల్సి ఉండడంతో ఆ పనులు నిలిచిపోయాయి. దీంతో వరదల సమయంలో వంతెన పక్కన తాత్కాలికంగా నిర్మించిన డైవర్షన్ రోడ్డుపై వాహనాలు దిగబడుతుండడంతో ఇటువైపు ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపేశారు. ప్రయాణికులు ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు రెండు నెలలకుపైగా ఇబ్బంది పడ్డారు. ఇప్పటికైనా వంతెన నిర్మాణ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై పీఆర్ ఏఈ యశ్వంత్ మాట్లాడుతూ.. త్వరలోనే పనులు తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నిదానపురం నర్సరీలో ఎదిగిన మొక్కలు

కాగితాల్లో లెక్కలు....నర్సరీల్లోనే మొక్కలు

దంతాలపల్లి (డోర్నకల్), న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా గత ప్రభుత్వం ప్రతి పల్లెలో హరితహారం నర్సరీని ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కల పెంపకాన్ని చేపట్టింది. పెంచిన మొక్కలను వర్షాలు కురిసే సీజన్‌లో పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేయడంతో గత కొన్నేళ్ల నుంచి పెంచిన మొక్కలు నాటడంతో నేడు అవి వృక్షాలుగా మారాయి. 2023-2024వ సంవత్సరంలో దంతాలపల్లి మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 2.04 లక్షల మొక్కలు పెంచారు. వీటితో గతేడాదికి చెందినవి సగం ఉండగా మిగతా సగం కొత్తగా పెంచారు. ప్రస్తుతం పెంచిన మొక్కలను గుర్తించిన ప్రదేశాల్లో నాటకుండా ఉపాధిహామీ పథకం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నర్సరీల్లోనే చెట్లవుతున్నాయి. రకరకాల మొక్కలు ఏపుగా పెరిగి పెద్ద వృక్షాలుగా ఎదుగుతున్నా అధికారులు వీటిపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమృద్ధిగా వర్షాలు కురిసే సమయంలో చెరువు కట్టలు, రోడ్లకు ఇరువైపులా, డొంకదారుల వెంట నాటినట్లయితే ఫలితం ఉండేదని...ప్రస్తుతం మొక్కలకు బదులుగా చెట్లను ఎలా నాటుతారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దంతాలపల్లి మండలం నిదానపురంలో సుమారు పది వేల దాకా మొక్కలు పెరిగి పెద్దవుతున్నా నాటడంపై అధికారులకు చిత్తశుద్ధి కరవైంది.

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762,
మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499
డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: భగత్‌సింగ్‌నగర్ కాలనీలోని ఓ వీధిలో పైపులైను లీకేజీ ఏర్పడి నీరంతా వృథాగా పోతుంది. **- బానోతు పద్మ**

సమాధానం: మున్సిపల్ సిబ్బందితో మరమ్మతు చేయిస్తాం. **- డౌలాగర్ స్వాతి, 26వ వార్డు కౌన్సిలర్.**

మహబూబాబాద్ టౌన్: ఆదర్శనగర్‌కాలనీ ప్రధానవీధిలో చెట్ల కొమ్మలను తొలగించి అక్కడే వదిలివెళ్లారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **శ్రీనివాస్**

సమాధానం: తగిన చర్యలు తీసుకుంటాం. **- తోట రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

మహబూబాబాద్ టౌన్: స్థానిక వివేకానంద కూడలి - నర్సంపేట బైపాస్ రహదారిలోని సైడ్ కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- మడత శ్రీనివాస్**

సమాధానం: కాల్వలను శుభ్రం చేయిస్తాం. **- తోట రాజేష్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

పిచ్చి మొక్కల తొలగింపు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: రేపోని శివారు జాలుబావులలోని నివాస గృహాలకు సంబంధించిన విద్యుత్తు నియంత్రికను పిచ్చి మొక్క తీగలు అల్లుకుపోయాయి. ఈ సమస్యపై ఈ నెల 26న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు విద్యుత్తు శాఖ ఏఈ ప్రవీణ్ స్పందించారు. విద్యుత్తు సిబ్బంది ఆదివారం తీగలను తొలగించడంతో సమస్య పరిష్కారమైంది.

పాదలు..

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లో పశువైద్యశాలకు వెళ్లే బాటలో కాలువ మీదున్న పాదలను సిబ్బంది ఆదివారం తొలగించారు. పరిసరాలు శుభ్రం చేశారు.

వీవోఏల వేతనాలు విడుదల చేయాలి

బయ్యారం, న్యూస్‌టుడే: ఐకేపీ గ్రామ సంఘ సహాయకులు(వీవోఏ)ల వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. బయ్యారంలో ఆయన ఆదివారం మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

పాత వంతెన.. ఉపయోగపడింది

డోర్నకల్, న్యూస్‌టుడే: ఉమ్మడి రాష్ట్రంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద ఆకేరు వాగు మీద లోలెవల్ వంతెన నిర్మించారు. వరదలొచ్చినప్పుడు లేదా భారీ వర్షాలు కురిసినప్పుడు దీని మీదుగా నీరు ప్రవహిస్తే రాకపోకలకు ఆటంకం ఏర్పడేది. ఏటా ఈ విధమైన అవాంతరం ఏర్పడుతుండటంతో ఆకేరు వాగుపై హైలెవల్ వంతెన అవసరమని గుర్తించారు. తదనుగుణంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో 2009 ఫిబ్రవరి 7న నాడు గిరిజన మారుమూల ప్రాంతాల అభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న రెడ్యానాయక్ లోలెవల్ వంతెనకు ఆనుకునే కొత్త వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు పూర్తయి హైలెవల్ వంతెన వాడకంలోకి వచ్చాక అప్పటిదాక ఉన్న లోలెవల్ వంతెన వినియోగించడం మానుకున్నారు. సెప్టెంబర్ ఒకటిన పోటెత్తిన వరదలకు హైలెవల్ వంతెన కొట్టుకునిపోవడంతో మహబూబాబాద్-ఖమ్మం జిల్లాల మధ్య 15 రోజుల పాటు రాకపోకలు నిలిచాయి. హైలెవల్ వంతెన పునరుద్ధరణకు ఏడాదికి పైగా సమయం అవసరం. నేషనల్ హైవే అధికారులు గతంలోని లోలెవల్ వంతెనని వాడకంలోకి తీసుకొస్తే బాగుంటుందనే ఆలోచన చేశారు. వెంటనే ఆ దిశగా కార్యాచరణ మొదలెట్టారు. ఇరువైపుల బాటని పరిచారు. కొంత మరమ్మతులు చేశారు. దీని మీదుగా భారీ వాహనాల రాకపోకలపై పోలీసులు నిషేధం విధించారు. ఆర్టీసీ బస్సులు, ఇతరత్రా వాహనాలకు అనుమతిలిచ్చారు. గతంలో అక్కడరకు రాదని మూసేసిన వంతెన ఇప్పుడు అక్కరకొచ్చింది.

లోలెవల్ వంతెన మీదుగా వాహనాల రాకపోకలు

సందడిగా బొడ్డెమ్మ వేడుకలు

బీరప్పనగర్‌లో..

తొర్రూరు, న్యూస్‌టుడే: తెలంగాణలో మహిళలు అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండగకు ముందు తొమ్మిదిరోజుల పాటు నిర్వహించే బొడ్డెమ్మ వేడుకలు కనులపండువగా కొనసాగుతున్నాయి. ఆదివారం డివిజన్ కేంద్రంలోని 11, 12వ వార్డులతో పాటు పలు కాలనీల్లో మహిళలు కోలాటాలు, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అమ్మవారికి ప్రసాదాలు సమర్పించి ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకున్నారు. వచ్చేనెల(అక్టోబర్) 2వ తేదీ వరకు బొడ్డెమ్మ వేడుకలు నిర్వహించనున్నారు.

తొర్రూరు డివిజన్

ఫోరం జిల్లా బాధ్యుడిగా కుమారస్వామి

తొర్రూరు, న్యూస్‌టుడే: బాలల హక్కుల పరిరక్షణ ఫోరం జిల్లా ఇన్‌ఛార్జిగా డివిజన్ కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త దొనికెన కుమారస్వామిని నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతికిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బడిబయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం, బాలల హక్కుల పరిరక్షణ కోసం ఫోరం పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

తొర్రూరు, న్యూస్‌టుడే: తొర్రూరు ఆర్టీసీ బస్సుడిపో పరిధిలో సోమవారం(నేడు) సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామని డిపో మేనేజర్ వి.పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో అభివృద్ధి, సమస్యలు, సలహాలు, సూచనలను 99592 26053 నెంబర్‌కు తెలియజేసి, ఆర్టీసీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

తొర్రూరు, న్యూస్‌టుడే: మండలంలోని వెలికట్ట గ్రామానికి చెందిన కొమ్ము రామచందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనతో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మిత్రుడి కుటుంబ సభ్యులకు ఆదివారం వారి నివాసంలో రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. స్నేహితులు శ్రీనివాస్, వెంకటరమణ, కొమిరెల్లి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని తీవ్రంగా కొట్టిన ఉపాధ్యాయురాలు

విద్యార్థి చేతిమణికట్టు వద్ద వాపు..

తొర్రూరు, న్యూస్‌టుడే: విద్యార్థిని ఉపాధ్యాయురాలు తీవ్రంగా కొట్టిన సంఘటన డివిజన్ కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తొర్రూరులోని వందేమాతరం ఫౌండేషన్‌లో ఉంటూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థి ఆరోతరగతి చదువుతున్నాడు. పాఠశాలలో పనిచేసే ఓ ఉపాధ్యాయురాలు గత ఐదు రోజుల క్రితం విద్యార్థిని కీళ్ల విరిగేలా కొట్టడంతో చేతికి కట్టుకట్టుకొని చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. ఆ ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా స్పందించలేదు.

పశువుల సంత దారంతా బురదమయం

తొర్రూరులో ప్రతి మంగళవారం జరిగే వారాంతపు సంత ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం దండిగా ఉన్నా, సౌకర్యాల లేమి మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. మహబూబాబాద్ రోడ్డులో ఉన్న పశువుల సంతకు వెళ్లే దారి బురదమయంగా మారడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు సౌకర్యం మెరుగు పర్చకపోవడంతో వెళ్లే వాహనాలు దిగబడుతున్నాయి. తాత్కాలిక మరమ్మతు అయినా చేయాలని కోరుతున్నారు.

– తొర్రూరు, న్యూస్‌టుడే

అ'పూర్వ' సమ్మేళనం..!

మానుకోట, న్యూస్‌టుడే: వారంతా మూడు దశాబ్దాల కిందట జిల్లా కేంద్రంలోని అరవింద విద్యాలయంలో చదువుకున్న పదోతరగతి విద్యార్థులు.. వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ఆనాటి జ్ఞాపకాలతో.. బాల్యపు ఆనందాలను పంచుకోవడానికి ఆదివారం ఓ వేడుకల మందిరంలో సమావేశమయ్యారు. 1994-95 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఆ పాఠశాల వ్యవస్థాపకుడు ఎన్.చంద్రదేవ్, ఉపాధ్యాయులను సత్కరించారు. ఆటపాటతో ఉల్లాసంగా గడిపారు.

ఉపాధ్యాయులతో అరవింద విద్యాలయ పూర్వవిద్యార్థులు

మాను పడితే ప్రమాదమే..!

ఎండిపోయి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న చెట్టు మహబూబాబాద్-ఇల్లెందు రహదారిలోని జ్యోతిబసునగర్‌కాలనీ రహదారిలో ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే ఎండిపోయిన మానును తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మహబూబాబాద్ టౌన్

మన్యం దారులు.. హరిత తోరణాలు!



బయ్యారం అభయారణ్యంలో

బయ్యారం అభయారణ్యం మీదుగా మన్యం గ్రామాలకు వెళ్లే రహదారులు హరితతోరణాన్ని తలపిస్తున్నాయి. గుట్టలు, వాగుల మధ్య రహదారులు పచ్చదనంతో అహ్లాదాన్ని పంచుతున్నాయి. అడవి మార్గంలోని కొన్ని ప్రాంతాల్లో ఇరువైపులా గుట్టల నడుమ రహదారులు వాహనదారులను ఆకట్టుకుంటున్నాయి. బయ్యారం పెద్ద గుట్ట ప్రాంతంలో కనిపించిన ఈ చిత్రాలు అటువైపు వెళ్లే వారికి ఆహ్లాదం కలిగిస్తున్నాయి.

– న్యూస్‌టుడే, బయ్యారం (మహబూబాబాద్)

రెండు గ్రామ పంచాయతీల పరిధిలో..

ఒక కార్యాలయం, గోదాం పక్కపక్కనే ఉన్నట్లు కనిపిస్తున్నా రెండు గ్రామ పంచాయతీల పరిధిలో విస్తరించి ఉన్నాయి. తొర్రూరు నుంచి అమ్మాపురం వెళ్లే రోడ్డులో గత మూడేళ్ల క్రితం పీఏసీఎస్ కార్యాలయంతో పాటు 1500 మెట్రిక్ టన్నుల గోదాను నిర్మించారు. ఆ కార్యాలయం తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో ఉండగా ఆనుకుని ఉన్న దాని గోదాం చింతలపల్లి గ్రామపంచాయతీ భూమిలో ఉంది. – తొర్రూరు, న్యూస్‌టుడే

చోరీపై ఆరా..

వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

చిన్నగూడూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సుధాగాని వెంకటయ్య ఇంటిల్లో శుక్రవారం అర్ధరాత్రి నకిలీ తుపాకీతో బెదిరించి రూ.35వేలు చోరీకి పాల్పడిన ఘటన విషయాన్ని తెలుసుకున్న డోర్నకల్ శాసనసభ్యుడు రామచంద్రునాయక్ అదివారం బాధితుడు ఇంటికి వెళ్లి జరిగిన ఘటనపై వివరాలు ఆరా తీశారు. చోరికి పాల్పడిన వాళ్లను గుర్తించాలని పోలీసులను ఆదేశించారు. సుధాగాని నగేష్, రమేష్, శ్రీను, జీవన్ ఉన్నారు.

విద్యుత్తు మోటార్ల చోరీ

నర్సింహులపేట, న్యూస్‌టుడే: కౌసల్యాదేవిపల్లి, అక్కిరాల గ్రామ శివారు ఆకేరు వాగు సమీపంలోని రెండ్రోజుల్లో పలువురు రైతులకు చెందిన మూడు వ్యవసాయ మోటార్ల చోరీ అయ్యాయి. ఆకేరు వాగు ఆయకట్టు ప్రాంతంలోని అక్కిరాల సమీపంలోని చంద్రారెడ్డి, కౌసల్యాదేవిపల్లికి చెందిన గడ్డి మోహన్‌రెడ్డి, పులి సోమయ్యల విద్యుత్తు మోటర్లు చోరీకి గురయ్యాయి. పోలీసులు, సంబంధిత అధికారులు రైతులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

తొర్రూరు, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడి లక్ష రూపాయల నగదు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని ఫత్తేపురంలో ఆదివారం చోటుచేసుకుంది. అదనపు ఎస్సై రాంజీనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అశోక్‌గౌడ్ బంధువులు చనిపోగా అంత్య క్రియలకు ఉదయం వెళ్లి ఆదివారం సాయంత్రం తిరిగి వచ్చారు. ఇంటికి రాగా తాళం పగులగొట్టి, బీరువాలో ఉన్న నగదు దొంగలించారని గ్రహించి ఫిర్యాదు చేశాడన్నారు. విచారణ చేపడుతున్నామని అదనపు ఎస్సై వివరించారు.

సీపీఎం మండల కమిటీ ఎన్నిక

ఇనుగుర్తి, న్యూస్‌టుడే: మండలకేంద్రంలో సీపీఎం గ్రామశాఖ మహాసభ గంజి సంజీవరెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా సీపీఎం మహబూబాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు గునుగంటి రాజన్న హాజరై మాట్లాడారు. ఇనుగుర్తి మండల శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అవుల వెంకన్న, సహాయ కార్యదర్శిగా గంజి సంజీవరెడ్డిని ఎన్నుకున్నారు. మార్తినేని పాపారావు, రైతుసంఘం నాయకులున్నారు.

ఏకగ్రీవ ఎన్నిక

వీరస్వామి(అధ్యక్షుడు), కె.వెంకన్న(ప్రధాన కార్యదర్శి)

గార్ల, న్యూస్‌టుడే: మండల తెలంగాణ ఆదివాసీ ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షుడుగా జబ్బా వీర స్వామి, ప్రధాన కార్యదర్శిగా కె.వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా కె.సారంగపాణి, మహిళా కార్యదర్శిగా ఉండం శోభారాణి, కోశాధికారిగా ఎట్టి రాముదొరను ఎన్నుకున్నారు. రాష్ట్ర బాధ్యులు మోకాళ్ల రామచంద్రు, వి.నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు సిద్ధబోయిన భిక్షం, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్తీ భాస్కర్, పెచ్‌ఎం ఎస్.జోగయ్య తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

దంతాలపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మినేని సతీష్ ఆదివారం పేర్కొన్నారు. దాట్ల గ్రామంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ ప్రత్యేక నిధులతో ఏర్పాటు చేస్తున్న ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు పనులకు ఆయన ప్రారంభించారు. పార్టీ నాయకులున్నారు.

జిల్లా వైద్యాధికారి పరామర్శ

దంతాలపల్లి: దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్లలో ఆర్థిక సమస్యలతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న వైద్యశాఖ ఉద్యోగి భైరి సుధాకర్ కుటుంబాన్ని జిల్లా వైద్యాధికారి మురళీధర్ పరామర్శించారు. సుధాకర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్య సిబ్బంది ఉన్నారు.

పవిత్ర జీవితం గడపండి

డోర్నకల్: దేవుడు అందరికి ఒక్కడేనని, ప్రతి ఒక్కరూ పవిత్ర జీవితం గడపాలని జమాతే ఇస్లామీ హింద్(జేఐహెచ్) వక్త అబ్దుల్ ముజీబ్ పేర్కొన్నారు. డోర్నకల్‌లో జేఐహెచ్ ఆదివారం ఏర్పాటు చేసిన 'ఐక్తెమ-ఇ-ఆమ్' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అబ్దుల్ మజీద్ మాట్లాడుతూ ఇస్లాం మత గ్రంథం 'ఖురాన్' విశిష్టత, సారాంశం, ప్రవక్త బోధనలు వివరించారు. ఆడ పిల్లలపై రోజురోజుకి పెరుగుతున్న ఆఘాయిత్యాలపై ఆందోళన వ్యక్తం చేశారు. జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు సత్తార్, డోర్నకల్ మండల బాధ్యుడు ఎంఏ వాజిద్, పుర ఛైర్మన్ వీరన్న, మతపెద్దలు ఆజం, అలీముద్దీన్ పాల్గొన్నారు

మానుకోటలో వాక్‌థాన్

మహబూబాబాద్: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో ధరణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, లయన్స్ క్లబ్, ఐఎంఏ, కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద కూడలి నుంచి ఎన్టీఆర్ మైదానం వరకు వాక్‌థాన్ నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ బి.నెహ్రూ మాట్లాడారు.

మహబూబాబాద్: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ఉషోదయ వాకర్స్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మదర్‌థెరిసా కూడలి మీదుగా వివేకానంద సెంటర్ వరకు వాక్‌రన్ నిర్వహించారు.

మృతికి సంతాపం

గార్ల, న్యూస్‌టుడే: ముల్కనూరులో తెదేపా సీనియర్ నాయకుడు వంకాయల ఎల్లయ్య(66) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. తెదేపా మండల నాయకులు పార్టీజెండాను కప్పి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, పట్టణాధ్యక్షుడు పి.రమేష్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు సుజ్ఞానప్రసాద్, మాజీ కన్వీనర్ రామ్‌జీ, కోటేశ్వరరావు, జిత్తేందర్ అగ్రవాల్, శివాజీ తదితరులున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

గార్ల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం శ్రేణులు సత్తా చాటాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ కోరారు. గార్లలో ఆదివారం మండల మహాసభ ఈశ్వరలింగం అధ్యక్షతన జరిగింది. దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పార్టీ శ్రేణులు ఉద్యమాలు చేయాలని తెలిపారు. మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులున్నారు.

పురస్కారం అందజేత

మహబూబాబాద్: పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు కోసం ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రజల్ని చైతన్యపరుస్తున్న ప్రకృతి ప్రేమికుడు, హరితమిత్ర అవార్డు గ్రహీత డైద వెంకన్న గుంటూరులో ఆదివారం అమ్మఒడి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విశిష్ట సేవారత్న పురస్కారం పొందారు. సంస్థ ఛైర్మన్ అల్లాడి శ్రీనివాసులు తదితరుల నుంచి అందుకున్నారు.

ఆసుపత్రి వద్ద ఆందోళన

కమాన్‌బజార్, న్యూస్‌టుడే: వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ చనిపోయిందని ఆరోపిస్తూ బంధువులు ఆందోళన చేసిన సంఘటన నగరంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. దంతాలపల్లి మండలం వేములపల్లికి చెందిన కుర్రా వుల సైదమ్మ(42)ను శస్త్ర చికిత్స కోసం ఆదివారం ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. స్కానింగ్ చేయకుండా శస్త్ర చికిత్స చేసేందుకు వైద్యులు ప్రయత్నించడంతో మహిళ మృతి చెందిందని ఆరోపిస్తూ బంధువులు నాలుగు గంటలపాటు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు.

మరమ్మతులు చేపట్టి.. పరిహారం చెల్లించాలి

నెల్లికుదురు, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వంసమైన చెరువులు, కుంటల కట్టలకు మరమ్మతు చేపట్టి నష్టపోయిన ముదిరాజులు, మత్స్యకార్మికులకు పరిహారం చెల్లించాలని మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ డిమాండ్ చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 8008001791
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9652211356

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

విద్యార్థినులకు ధ్రువీకరణ అందజేస్తున్న నిర్వాహకులు

మరిపెడ, న్యూస్‌టుడే: పురిమళ్ల ఫౌండేషన్, అక్షరాల తోవ ఖమ్మం ఆధ్వర్యంలో పురిమళ్ల ఫౌండేషన్ 6వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన పుస్తక సమీక్షల పోటీలో మరిపెడ ఆదర్శ పాఠశాల విద్యార్థినులు నందిగామ స్వరూప, గర్రెపల్లి లక్ష్మినందిని ప్రతిభ కనబరచినందుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ప్రతిభా పురస్కారాలను విద్యార్థినులకు ఖమ్మం మంచికంటి భవన్‌లో నిర్వాహకులు ఆదివారం అందజేశారు. సాహిత్యంపై మక్కువతో తెలుగు ఉపాధ్యాయుడు యోలిశాల నాగమోహన్ ప్రోత్సాహంతో పెన్ కౌంటర్, చైతన్య దీపాలు పుస్తకాలపై విద్యార్థినులు రాసిన సమీక్షలు పోటీలో ఉత్తమ స్థానంలో నిలిచి సమీక్షల సమాహారం పుస్తక సంకలనంలో చోటు దక్కించుకున్నాయి. విద్యార్థినులను పోటీ నిర్వాహకులు, మరిపెడ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ అక్తర్ రుజ్మాన్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

వాలీబాల్ క్రీడాకారుల ఆత్మీయ సమ్మేళనం

ఇనుగుర్తి, న్యూస్‌టుడే: మండలకేంద్రంలో